
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

మంగళవారం 18 జూన్ 2024



అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడులకు గజమాల

- వార్త I పేజీలో



ఎయిర్‌పోర్టు వద్ద స్వాగతం పలికేందుకు వచ్చిన అభిమానులు, టీడీపీ శ్రేణులకు అభివాదం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

అపూర్వ స్వాగతం



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులై సోమవారం నగరానికి చేరుకున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు పార్టీ శ్రేణులు సాదర స్వాగతం పలికాయి. అనంతరం ఆయన ర్యాలీగా ఎయిర్‌పోర్టు నుంచి గాజువాక చేరుకున్నారు.

- వార్త I పేజీలో

ఏయూ ప్రక్షాళన

మానవ వనరుల శాఖా మంత్రి లోకేశ్ ప్రత్యేక దృష్టి



వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి

- ఐదేళ్లలో యూనివర్సిటీ ప్రతిష్ఠను దిగజార్చిన పాలకులు
- అస్మదీయులకు అడ్డగోలుగా పదవులు... గిట్టని వారిపై కక్షసాధింపులు
- ఎన్నికలకు ముందు పల్లా సతీమణిపైనా వేధింపులు
- దాతలు ఇచ్చిన నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపణలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలు వ్యవహారాలకు, అవినీతి కార్యకలాపాలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా నిలిచింది. వీసీగా పీవీజీడీ ప్రసాదరెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాజకీయ కేంద్ర బిందువుగా మారి, అనధికారిక వైసీపీ కార్యాలయంగా మారిపోయింది. ఈ వ్యవహారాలపై ప్రతిపక్షంలో ఉండగా ఘాటుగా స్పందించిన టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ ప్రస్తుతం మానవ వనరుల శాఖా మంత్రిగా బాధ్యతలు తీసుకోవడంతో ఏయూ ప్రక్షాళనకు రంగం సిద్ధం చేశారని సమాచారం. ఎంతో చరిత్ర ఉన్న వర్సిటీని తిరిగి ఉన్నత స్థానంలో నిలిపేందుకు వీలుగా త్వరలోనే చర్యలకు ఉపక్రమించనున్నట్టు తెలుస్తోంది.



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

దేశంలోనే పేరెన్నికగన్న యూనివర్సిటీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి స్థానం ఉంది. గతంలో వీసీలుగా పనిచేసిన వారంతా ఈ ప్రతిష్ఠకు ఏమాత్రం భంగం కలగకుండా బాధ్యతలు నిర్వర్తించారు. అయితే ఇన్‌చార్జి వీసీగా పీవీజీడీ ప్రసాదరెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వర్సిటీ ఖ్యాతి దిగజారింది. రాజకీయ కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా మారిపోయింది. వీసీ వైసీపీ కార్యకర్తగా మారిపోయి ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. అడ్డగోలు నిర్ణయాలు, నియామకాలకు వర్సిటీని కేంద్రాంగా మార్చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి.

రిజిస్ట్రార్‌తో ప్రారంభం

నిబంధనలకు విరుద్ధగా ప్రొఫెసర్ కృష్ణమోహన్‌ను మూడు పర్యాయాలు రిజిస్ట్రార్‌గా నియమించడం దీనికి ఉదాహరణగా పేర్కొంటున్నారు. తన పలుకుబడిని ఉపయోగించి పదవీ విరమణ చేసిన తరువాత కూడా అనేకసార్లు రిజిస్ట్రార్‌గా పొడిగింపు ఉత్తర్వులను తీసుకువచ్చారు. అంతేకాకుండా సుమారు వందమందికిపైగా అస్మదీయులకు వర్సిటీలోని అనేక విభాగాల్లో అడ్జెంక్ట్ ప్రొఫెసర్లు, ఛైర్ ప్రొఫెసర్లుగా అవకాశాలను కల్పించారు. గత మూడేళ్లగా రిటైర్ అయిన ఎంతోమంది ప్రొఫెసర్లను కీలక స్థానాల్లో కూర్చోబెట్టారు. ఇప్పటికీ వీరు కీలక విభాగాధిపతులుగా, డీన్లుగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలోని ఏ విశ్వవిద్యాలయంలోనూ ఎయిడెడ్ ఫ్యాకల్టీని వర్సిటీలో నియమించరు. కానీ వారికి పోస్టింగులు ఇవ్వడంతో పాటు కీలక విభాగాలను కేటాయించారు. కొందరికి నిబంధనలకు విరుద్ధంగా హెచ్‌వోడీలుగానూ అవకాశం కల్పించారు. అదే సమయంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న చాలామంది గెస్ట్ ఫ్యాకల్టీని బయటకు పంపించేశారు. వారు రోజుల తరబడి దీక్షలు చేసినా కనీసం పట్టించుకోలేదు. ఏయూ ప్రాంగణంలో నిరసన తెలిపేందుకు కూడా అవకాశం కల్పించలేదు.

పీహెచ్‌డీల్లోనూ గోల్‌మాల్

ఏయూలోని పీహెచ్‌డీ ప్రవేశాలను కూడా వీసీ వ్యాపారం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏయూ పాలకులు లక్షలాది రూపాయలు తీసుకుని పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించారని స్వయంగా వర్సిటీలో పనిచేసే ఓ సీనియర్ ప్రొఫెసర్ మీడియా ముఖంగా ఆరోపణలు గుప్పించారు. అదేవిధంగా వర్సిటీలో ఎంతోమంది సీనియర్ ప్రొఫెసర్లు ఉన్నప్పటికీ, వారిని కాదని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో పనిచేస్తున్న వ్యక్తికి రిజిస్ట్రార్ బాధ్యతలను అప్పగించడం కలకలం రేపింది. ఈ నిర్ణయాన్ని ఎంతోమంది అధికారులు తీవ్రస్థాయిలో వ్యతిరేకించినా ప్రసాదరెడ్డి వెనక్కి తగ్గలేదు.

పచ్చని చెట్లపై వేటు

వర్సిటీ ఖ్యాతిని జాతీయ స్థాయిలో మంటగలిపే మరో చర్యకు వీసీ ప్రసాదరెడ్డి పాల్పడ్డారు. వందలాది ఎకరాల్లో ఉన్న వేలాది వృక్షాలు, చెట్లను తొలగించేశారు. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే వంకతో పచ్చదనంపై వేటువేశారు. ఆ ప్రాంతంలో ఇప్పటికీ పనులు సాగుతుండడం గమనార్హం. అంతేకాదు ఓ ప్రైవేటు వ్యక్తికి ఈ స్థలాన్ని కట్టబెట్టేందుకు యత్నించారని, అన్ని వర్గాల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని వర్సిటీలోని అధికారులే చెబుతున్నారు.

గిట్టని వారిపై వేధింపులు

అస్మదీయులకు అడ్డగోలుగా పదవులు

- మిగతా I పేజీలో

వర్సిటీలో అరాచకం



జేమ్స్ స్టీఫెన్

- నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రార్ పీహెచ్‌డీ ప్రవేశం
- 2022లో ఎగ్జిక్యూటివ్ కోటాలో ప్రవేశాన్ని పొందిన ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్
- రూ.50 కోట్లు టర్నోవర్ ఉన్న సంస్థలకు మాత్రమే ఎగ్జిక్యూటివ్ కోటాకు అవకాశం
- పీహెచ్‌డీ ప్రవేశం పొందే సమయానికి ఏయూలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా స్టీఫెన్
- అది కూడా మరో ఉల్లంఘన

విశాఖపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ నిబంధనలకు విరుద్ధంగా పీహెచ్‌డీ ప్రవేశాన్ని పొం దారు. ఆయన 2022లో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో పీహెచ్‌డీలో చేరారు. కొద్దిరోజుల కిం దట ప్రీ పీహెచ్‌డీ పరీక్షల కోసం దరఖాస్తు చేసిన ప్పుడు... విభాగాధిపతి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సాధారణంగా ఎగ్జిక్యూటివ్ కోటాలో పీహెచ్‌డీ పట్టా పొందాలంటే కొన్ని నిబంధనలు ఉంటాయి. ఏ సంస్థ నుంచి అయితే ఎగ్జి క్యూటివ్ పీహెచ్‌డీ ప్రవేశం పొందాలనుకుంటున్నారో ఆ సంస్థ టర్నోవర్ కనీసం రూ.50 కోట్లు ఉండాలి. పీహెచ్‌డీ ప్రవేశం పొందే సమయానికి స్టీఫెన్ నగర పరిధిలోని ఒక ఇంజనీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఆ సంస్థ టర్నోవర్ ఆ స్థాయిలో లేకపోయినప్పటికీ ఎగ్జి క్యూటివ్ కోటాలో ఆయనకు పీహెచ్‌డీ ప్రవేశాన్ని కల్పిం చారు. అదేవిధంగా ఆ ప్రవేశం పొందే సమయానికే స్టీఫెన్ ఏయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా వ్యవహరిస్తున్నారు. వర్సిటీలోని కీలక పదవిలో ఉంటుండగా పీహెచ్‌డీలో ప్రవేశం పొందకూడదు. కానీ, ఈ నిబంధనను కూడా ఉల్లంఘించి మరీ ఆయన ప్రవేశాన్ని పొందారని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. అధికారాన్ని దుర్వినియోగం చేసి ఉన్నతాధికారి అండదండలతోనే పీహెచ్‌డీ ప్రవేశాన్ని పొందినట్టు చెబుతున్నారు. ఇదిలావుండగా స్టీఫెన్ పీహెచ్‌డీ ప్రవేశం ప్రస్తుతం హెచ్‌వోడీగా ఉన్న ప్రొఫెసర్‌కు

- మిగతా I పేజీలో

ఆ మూడూ జగన్ కోసం...



- ఒక భవంతి జగన్ దంపతుల కోసం, మరో రెండు కుమార్తెలకు...
- వాటికి మాత్రమే సీ వ్యూ
- బాత్‌రూమ్ టబ్ ఒక్కొక్కటి రూ.26 లక్షలు?
- స్పెషల్‌గా స్పా రూమ్
- అన్యులకు ప్రవేశం లేకుండా పెద్ద గేటు ఏర్పాటు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రుషికొండపై రాజమహల్‌ను ప్రత్యేకంగా నిర్మించారు. ఏడు భవనాల్లో మూడు ప్రత్యేకంగా జగన్ కుటుంబం కోసమే తీర్చిదిద్దారు. అక్కడ ఈ మూడింటికి మాత్రమే సీ వ్యూ ఉంది. మిగిలిన వాటికి ఎదురుగా బీచ్‌రోడ్డు, గీతం కాలేజీ కనిపిస్తాయి. జగన్ కుటుంబం కోసం నిర్మించిన భవనాల్లో బాల్కనీలోకి వచ్చినా, బాత్‌రూమ్‌లో నుంచైనా కిటికీల నుంచి సముద్రం కనిపిస్తుంది. అలా డిజైన్ చేసుకున్నారు. అలాగే మసాజ్ కోసం ప్రత్యేకంగా ఒక గది ఏర్పాటు చేసుకున్నారు. దానికి 'స్పా రూమ్' అని పేరు పెట్టుకున్నారు. ఇవన్నీ గ్రౌండ్ ప్లస్ వన్ నిర్మాణాలు. విజయనగర-1 భవనం జగన్, భారతీల కోసం నిర్మించారు. అందులో నాలుగు పడక గదులు ఉన్నాయి. మిగిలిన రెండు భవనాలు చెరో కుమార్తె కోసం ఉద్దేశించినవి. వాటిలో కూడా నాలుగేసి పడక గదులు, విశాలమైన సమావేశ మందిరాలు ఉన్నాయి. ఈ మూడు భవనాలను, మిగిలిన నాలుగింటికి దూరంగా సముద్రానికి అభిముఖంగా నిర్మించారు. వీటికి ప్రత్యేకంగా పెద్దగేటు ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులు తప్ప ఇంకెవరికీ అటువైపు ప్రవేశం లేకుండా చేశారు. పిడుగులు పడినా చెక్కు చెదరకుండా ఏర్పాట్లు ఉన్నాయి. వీటిలో బాత్‌రూమ్ టబ్ ఒక్కొక్కటి రూ.26 లక్షలని చెబుతున్నారు. ఇంటర్నేషనల్ బ్రాండ్ టోటో కంపెనీకి చెందిన బాత్‌రూమ్ ఫిటింగ్స్ వినియోగించారు. ఇలాంటివన్నీ పర్యాటకుల కోసమేనా?... అని వైసీపీ నేతలను ప్రశ్నిస్తే...సమాధానం చెప్పకుండా అవి ప్రభుత్వ భవనాలే కదా? అంటున్నారు తప్పితే..అంత ఖర్చు ఎందుకు చేశారో చెప్పడం లేదు.

అధ్యక్షా...

చింతకాయల అయ్యన్నపాత్రుడుకు అరుదైన గౌరవం

- శాసనసభ స్పీకర్‌గా ఎంపిక చేసిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు
- విధేయత, సీనియారిటీకి గుర్తింపు
- ఉమ్మడి విశాఖపట్నం నుంచి శాసన సభాపతిగా ఎన్నికైన తొలి నేతగా గుర్తింపు
- ఉత్తరాంధ్ర నుంచి ఐదోవారు...



చింతకాయల అయ్యన్నపాత్రుడు

అనకాపల్లి/నర్సీపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సీనియర్ నేత, మాజీ మంత్రి, నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడుకు కూటమి ప్రభుత్వం సముచిత స్థానం కల్పించనున్నది. ఆయనను రాష్ట్ర శాసన సభ స్పీకర్ పదవికి సీఎం నారా చంద్రబాబునాయుడు ఎంపిక చేశారు. అయ్యన్నపాత్రుడు నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ ఒకసారి ఎంపీగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎన్టీ రామారావు, చంద్రబాబునాయుడు మంత్రివర్గాల్లో పనిచేశారు.

ఉత్తరాంధ్ర నుంచి ఐదో వ్యక్తి...

ఆంధ్రరాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకూ ఉత్తరాంధ్ర నుంచి నలుగురు స్పీకర్ పదవి పొందారు. అయ్యన్నపాత్రుడు ఐదో వ్యక్తి అవుతారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైన తరువాత రెండేళ్లకు బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో టెక్కలి శాసనసభ్యుడు రొక్కం లక్ష్మీనరసింహందొర (ఆర్‌ఎల్‌ఎన్ దొర) 1955 ఏప్రిల్ 25న స్పీకర్‌గా ఎన్నికయ్యారు. ఆ తరువాత మళ్లీ తెలుగుదేశం హయాంలో 1983 జనవరిలో ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శ్రీకాకుళం శాసనసభ్యుడు తంగి సత్యనారాయణ స్పీకర్ అయ్యారు. అయితే 1984 ఆగస్టు సంక్షోభం సమయంలో సత్యనారాయణ...నాదెండ్ల భాస్కరరావు వర్గంలో చేరడంతో ఆయన పదవి పోయింది. మళ్లీ 1999లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పుడు శ్రీకాకుళం జిల్లా

- మిగతా I పేజీలో

ఉమ్మడి జిల్లాకు టీడీపీ పెద్దపీట

ముగ్గురికి కీలక స్థానాలు

- స్పీకర్, హోం మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి కట్టబెట్టిన అధినేత చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పదవుల పంపకంలో ఉమ్మడి విశాఖ జిల్లాకు తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు పెద్దపీట వేశారు. ముఖ్యమంత్రి తరువాత ప్రాధాన్యం కలిగిన స్పీకర్ పదవి నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాలయ అయ్యన్నపాత్రుడుకు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వంలో కీలకమైన హోంమంత్రి పదవి పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితకు ఇచ్చారు. అలాగే గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును పార్టీ రాష్ట్ర అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టి విశాఖ జిల్లాపై తనకున్న అభిమానాన్ని చంద్రబాబు చాటుకున్నారు.

టీడీపీ ఆవిర్భావం తరువాత రెండు, మూడు పర్యాయాలు తప్ప విశాఖ జిల్లా ప్రజలు తెలుగుదేశం పార్టీకే అత్యధిక సీట్లు ఇస్తూ వచ్చారు. గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ గాలి వీచినా

- మిగతా I పేజీలో

భక్తిశ్రద్ధలతో బక్రీద్



వన్‌టౌన్‌లో ప్రత్యేక నమాజును ఆచరిస్తున్న ముస్లిం సోదరులు

- వార్త I పేజీలో



కలెక్టర్, పోలీస్ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి వంగలపూడి అనిత

గంజాయిపై ఉక్కుపాదం

- నియంత్రణకు టాస్క్‌ఫోర్స్
- చెక్‌పోస్టులు పెంచుతాం సీసీ కెమెరాలు ఏర్పాటు
- మూడు నెలల్లో పూర్తిస్థాయిలో అడ్డుకట్ట
- నిందితులు ఏ పార్టీకి చెందిన వారైనా కఠిన చర్యలు

రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత

... మెయిన్‌లో

న్యాయవాదులు వృత్తిపరంగా నైపుణ్యం పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బిషప్ జయరావు

మహారాణిపేట, జూన్ 17: సత్యం న్యాయం పరిరక్షణకు ప్రతీ న్యాయవాదీ వృత్తి పరమైన నైపుణ్యం పెంపొందించుకోవాలని రోమన్ క్యాథలిక్ విశాఖ అగ్రపీఠం పరిపాలనా అధికారి బిషప్ డాక్టర్ పోలిమేర జయరావు అన్నారు. సోమవారం విశాఖ కొండగుడి రోజ్‌హిల్స్‌లో తెలుగు రీజియన్ క్యాథలిక్ అడ్వకేట్ ఫోరమ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్యాథలిక్ న్యాయవాదులకు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బిషప్ జయరావు మాట్లాడుతూ చట్టంపై అవగాహన కలిగి ఉండడంతోపాటు క్రీస్తు ప్రభువుపై విశ్వాసంతో వ్యవహరించాలని తెలిపారు. న్యాయవాదుల చట్ట పరిరక్షతోనే దేశం సమైక్యంగా ఉంటుందన్నారు. ఒంగోలు జిల్లా కోర్టు సెషన్స్ జడ్జి దున్న రాములు చట్ట పరమైన న్యాయవాదులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో ఫోరమ్ ఫాదర్ రాజు, అలెక్స్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, ఎస్ఆర్ జెస్సీ, కుర్దాన్‌తో పాటు వివిధ జిల్లాలనుంచి వచ్చిన న్యాయవాదులు పాల్గొన్నారు.

రైతు నిజాయితీ

» దొరికిన బంగారం గొలుసు అప్పగింత


బాధితురాలికి బంగారు అభరణాలను అందచేస్తున్న రైతు బజారు అధికారి కొండబాబు

సీతమ్మధార, జూన్ 17: సీతమ్మధార రైతు బజార్‌లో ఓ రైతు తనకు దొరికిన బంగారు గొలుసును పోగొట్టుకున్న వారికి అందచేసి తన నిజాయితీని చాటుకున్నాడు. దొండపర్తి ప్రాంతానికి చెందిన కనకదుర్గాదేవి అనేమహిళ ఆదివారం కూరగాయలు కొనుగోలుకు రైతు బజార్‌కి వచ్చారు. ఈ క్రమంలో ఆమె మెడలోని బంగారు నల్లపూసల దండ పడిపోయింది. అది రైతు సీతఅప్పారావుకి దొరికింది. సుమారు ఎనిమిది తులాల ఈ గొలుసును తీసుకువెళ్లి ఎస్టేట్ అధికారికి అప్పారావు ఇచ్చారు. గొలుసుపోయిన కనకదుర్గాదేవి సోమవారం వచ్చి బజార్‌లో ఆరా తీశారు. దీంతో ఎస్టేట్ అధికారి కొండబాబు, రైతు సీతఅప్పారావు చేతుల మీదుగా ఆమెకు బంగారు గొలుసును అందజేశారు. ఈ సందర్భంగా అప్పారావును ఎస్టేట్ అధికారి, తోటి రైతులు అభినందించారు.

మంగమారిపేట తీరంలో తండేల్ సినిమా షూటింగ్


యాక్షన్ సన్నివేశంలో నాగచైతన్య

భీమునిపట్నం, జూన్ 17: బీచ్ రోడ్ మంగమారిపేట తీరంలో సోమవారం తండేల్ సినిమా షూటింగ్ జరిగింది.హీరో అక్కినేని నాగచైతన్య ఇంటికి హీరోయిన్ సాయి పల్లవి రావడం, వారిద్దరూ కలిసి వీధుల్లో తిరిగిన సన్నివేశాలను చిత్రీకరించారు. అలాగే తీరంలోమరికొన్ని సన్నివేశాలు తెరకెక్కించారు. బన్నీ వాసు నిర్మిస్తు న్న ఈ సినిమాకు దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించగా,.చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు.


తీరంలో హీరోయిన్ సాయిపల్లవి


సీతమ్మధార రైతుబజార్ పక్కన గల జీవీఎంసీ హాకర్స్ జోన్


హాకర్స్ జోన్‌లో చేపల మార్కెట్ విక్రయాలు


ఖాళీగా ఉన్న వ్యాపారుల స్టాల్స్

సీతమ్మధార హాకర్స్ జోన్‌లో వసతుల లేమి

» కరెంట్, నీటి సదుపాయాలు కరవు

» వ్యాపారులు, కొనుగోలుదారుల అవస్థలు

» వృథాగా స్టాల్స్ ...వాటిలో స్టాక్‌బాక్సులు

సీతమ్మధార, జూన్ 17: సీతమ్మధార రైతు బజార్ పక్కనే చేపలు, కూరగాయలు, మాంసం, పండ్లు విక్రయాల నిమిత్తం కొన్ని సంవత్సరాల క్రితం ఏ ర్పాటు చేసిన హాకర్స్ జోన్‌ను వసతులలేమి వెంటాడుతోంది. వెజ్, నాన్ వెజ్ విక్రయాలకు ఇది ఎంతో ప్ర ధానంగా నిలుస్తోంది. ఈ హాకర్స్‌జోన్‌లో ఉన్న మొ త్తం 36 స్టాల్స్‌లున్నా, అందులో సగం వాటిలోనే వ్యా పారాలు సాగిస్తున్నారు. వీటిలో ఐదుగురు చేపల వ్యా పారం, రెండు చికెన్ సెంటర్లు, మరోవైపు ఫ్రూట్స్ షా పు, రెండు కూరగాయల దుకాణాలు, కిరాణా కొట్టులో మాత్రమే వ్యాపారులు చేస్తున్నారు. మిగిలిన వారంతా వ్యాపారం లేకపోవడంతో వెళ్లిపోయారు. దీం తో కొన్ని స్టాల్స్ ఖాళీగానే ఉంటున్నాయి. ప్రధానంగా హాకర్స్ జోన్‌కి వసతులు కల్పించకపోవడంతో ఉన్న వ్యాపారులూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోపల సదుపాయాలులేక బయట గంపలు పెట్టుకుంటూ కొంత మంది వ్యాపారం సాగిస్తున్నారు. ప్రధానంగా విద్యుత్ తో పాటు తాగునీటి సదుపాయాలు లేకపోవడంతో సమస్యలుఎదుర్కొంటున్నారు. సీతమ్మధార, పీఅండ్‌టీ కాలనీ, టీపీటీ కాలనీ, నక్కవానిపాలెం, చైతన్యనగర్, మద్దిలపాలెం, కేఆర్‌ఎం కాలనీ, ఇందిరా ప్రియదర్శిని తదితర ప్రాంతాల నుంచి నివాసితులు ఇక్కడికి చేపలు, చికెన్, పండ్లు కొనుగోలుకు వస్తుంటారు. అయితే చేపల విక్రయం తర్వాత లోన వసతి లేక బయటకు వచ్చి వాటిని బాగుచేస్తుంటారు. దీంతో పాటు స్టాల్స్ అటుఇటు ఉండటంతో ఒక్కోసారి జనం కొనుగోలుకు ఇబ్బందిగా ఉంటోంది. చేపలు బాగుచేసిన వ్యర్థాలువేయడానికి వీలుగా లేక రోడ్డుపై వదిలేస్తుండడంతో పరిసరాల్లో దుర్వాసన వస్తోంది. పగటి పూట ఏదోలా వ్యాపారం చేస్తు జీవనం సాగిస్తున్న వ్యాపారులు... రాత్రివేళలో విద్యుత్ సదుపాయంలేక అక్కడంతా చీకటిగా మయంగా మారుతోంది. దీంతో సాయం త్రమయ్యేసరికి మిగిలిపోయిన చేపలు, చికెన్, ఫ్రుట్స్ బాక్సులో భద్రపరిచి వెళ్లాల్సి వస్తోంది. కొంతమంది దొంగలు హాకర్స్ జోన్‌లో రాత్రివేళల్లో వీటిని అపహరించుకుపోతున్నారు. వేలాది రూపాయల విలువైన చేపలు దొంగిలించుకుపోవడంతో ఎంవీపీ పోలీ సు స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదులు చేసినట్టు వా ప్యారులు వాపోతున్నారు. హకర్స్ జోన్‌లో కరెంట్, మంచినీటి సౌకర్యంతో పాటు చెత్త వేయడానికి డస్ట్ బిన్స్, కొనుగోలుకోసం వచ్చే వారికి అత్యవసర సమయంలో బాతురూమ్ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. జీవీఎంసీ అధికారులు ఈమేరకు దృష్టి సారించాలని కోరుతున్నారు.


బయట చేపలు బాగుచేస్తున్న మహిళ

హోం మంత్రిని కలిసిన ఏపీ జేఏసీ నాయకులు

సిరిపురం, జూన్ 17 : రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను ఏపీ జేఏసీ అమరావతి విశాఖపట్నం జిల్లా నాయకులు సోమవారం నగరంలోని సర్క్యూట్ హౌస్‌లో కలిశారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ మన ఉద్యోగి అనిత కమ్యూనిటీ నుంచి రాజకీయంలో అడుగుపెట్టి హోం శాఖా మంత్రి స్థాయికి ఎదగడం తమకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, జేఏసీ వుమెన్ వింగ్ చైర్‌పర్సన్ శైలజా పాణిగ్రాహి, ఆర్టీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఎస్ఎస్ మూర్తి, మున్సిపల్ టీచర్ల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి సిద్ధార్థ, ఫిజికల్లీ చాలెంజెడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, పంచాయతీరాజ్ అధ్యక్షుడు శ్రీనివాస్, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సురేష్ కుమార్, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల ప్రతినిధి శంకర్, యోగి, మణికంఠ పాల్గొన్నారు. అలాగే గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు కూడా అనితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి కుంచె, జిల్లా ప్రెసిడెంట్ యజ్జల విజయకుమార్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ జాయింట్ సెక్రటరీ జి. నిర్మల, డ్వామా పీడీ సందీప్, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, డీఈఈ ఇరిగేషన్ ముక్కల రాజేంద్ర, ఎక్సైజ్ సీఐ యమ్మల రాజు, పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్ రమణ, తహసీల్దార్ అంబేద్కర్, క్వాసీ డీఈఈ రమణమూర్తి, ఏడీఈ ఎలక్ట్రోకల్ బాత రాజేష్, డీడీఈ పీఆర్‌లు తలే రమణ, వై.పోలీస్, జిల్లా హార్టికల్చర్ ఆఫీర్ ప్రభాకర్ పాల్గొన్నారు.


హోంమంత్రి అనితను కలిసిన ఏపీజేఏసీ అమరావతి విశాఖ జిల్లా నాయకులు


హోంమంత్రిని కలిసిన గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు


సెంట్రల్ పార్కు వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు


నమాజ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

డాబాగార్డెన్స్, జూన్ 17: ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 'ఈదుల్ జుహ నమాజు'ను డాబాగార్డెన్స్ విశాఖ మహిళా కళాశాల సెంట్రల్ పార్కు ఖాళీ స్థలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న ముస్లిం సోదరులు , చిన్నారులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. సర్వమాన సమానత్వం, ప్రపంచశాంతి, సౌభ్రాతృత్వం ఆకాంక్షిస్తూ హాజీ ఖాసింరజా మౌలానా ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిపించారు. ముస్లిం సోదరులు, చిన్నారులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని..బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం వెల్ఫేర్ సొసైటీ విశాఖ అధ్యక్షులు జనాబ్ హైదర్ అలీ సింకా మాట్లాడుతూ బక్రీద్ అంటే త్యాగానికి ప్రతీక అన్నారు. ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ కరుణ, ఐక్యతతో బక్తి శ్రద్ధలతో పండగ ఆనందంగా జరుపుకుంటారన్నారు. అల్లా ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. తమకు రంజాన్, బక్రీద్‌లల్లో ప్రత్యేక ప్రార్థనలకు వీలుగా ఈ ప్రాంతాన్ని కేటాయించాలని ఇవ్వాలని జీవీఎంసీని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు హాజీమీర్ అబ్బాస్ హుస్సేన్, సెక్రటరీ హాజీ అమీర్‌జాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ రహమతుల్లా, ట్రజరర్ ఎస్.కె. అహ్మద్‌వలీ, మెహబూబ్ అలీఖాన్, అజ్‌గర్అలి, మహబూబ్‌షరీఫ్, మహ్మద్ అస్లం, ఎస్.ఎ.మునీర్ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: బక్రీద్ సందర్భంగా అక్కయ్యపాలెం చిన్నూరు మసీదులో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్, 26వ వార్డు కార్పొరేటర్ ముక్క శ్రావణి, ముక్క కిషోర్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు ఈసందర్భంగా నజీర్ శుభాకాంక్షలు తెలిపారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ వేడుక జరుపుతారన్నారు. అల్లా దయతో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రావడం రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయన్నారు. రాష్ట్ర ముస్లిం మైనారిటీ సెక్రటరీ షేక్ బాబ్జీ, విశాఖ పార్లమెంట్ మైనారిటీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌస్, ఎంఎ జానీ పాల్గొన్నారు.

నమాజ్‌లో దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ

పూర్ణామార్కెట్: వన్‌టౌన్‌లో ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాతపోస్టాఫీసు కోటవీధి ఈద్గా వద్ద సామూహిక నమాజ్‌లో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. రామకృష్ణా జంక్షన్ వద్ద మసీదులో ఉదయం ము స్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ముస్లిం సోదరులు ఒకరితో ఒకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జగదాంబ దరి వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. సామూహిక నమాజ్‌లు చేశారు. మతగురువులు ఖురాన్ పఠనం చే శారు.

రైళ్లలో ఆకస్మిక టికెట్ తనిఖీలు

విశాఖపట్నం, జూన్ 17: రైళ్లలో రద్దీ సమస్యలను పరిష్కరించడం,ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని వాల్తేరు రైల్వే టికెట్ చెకింగ్ సి బ్బంది సోమవారం పలు రైళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆర్‌పీఎఫ్ సమన్వయంతో వివిధ రైళ్లలోని రిజర్వ్‌డ్ కోచ్ లు, దివ్యాంగుల కోచ్‌లతోపాటు మహిళలకు ప్రత్యేకంగా కేటాయించిన కోచ్‌లలో తనిఖీ చేసి టికెట్‌లేని ప్రయాణికుల నుంచి జరిమానా వసూలు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ మాట్లాడుతూ, ప్రయాణికుల భద్రత, సౌకర్యాలు, రైళ్ల సమయపాలనపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు.



నిరుద్యోగులపై తక్షణం కేసులు ఎత్తి వేయాలి

» మంత్రులు అచ్చన్న, రామ్మోహన్‌నాయుడులకు నిరుద్యోగ జేఏసీ వినతి

అక్కయ్యపాలెం, జూన్ 17: ఒకే కుటుంబానికి చెందిన అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడులు పదవులు అలంకరించడం ఉత్తరాంధ్రకు గర్వకారణమని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. మంత్రులుగా పదవి బాధ్యతలు స్వీకరించిన తరువాత శ్రీకాకుళం వెళ్తున్న కింజరపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి అక్కయ్యపాలెంలో గజమాలతో, కిరిటాలతో సమయం హేమంత్‌కుమార్ స్వాగతం పలికి సత్కరించారు. గత ప్రభుత్వం నిరుద్యోగులపై పెట్టిన కేసులన్నీ ఎత్తి వేయాలని, ప్రస్తుతం ప్రకటించిన 20 లక్షల ఉద్యోగాలకు వార్షిక క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. విశ్వవిద్యాలయాలను ప్రక్షాళన చేయాలని కోరారు. చట్టసభలో స్థానాలు కల్పించాలని ఈ సందర్భంగా కోరారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ ఉద్యోగ వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలని కోరారు. కోరారు. పౌరగ్రంథాలయం నుంచి నిరుద్యోగ యువత, ఏయూ విద్యార్థులు, ఏయూ ఐక్య విద్యార్థి ఫ్రంట్ అధ్యక్షులు ఎం. శాంతిభూషణ్, కిషాన్ మోర్చా జనరల్ సెక్రటరి పొ ట్నూరి వెంకట కృష్ణారావు, సనపల తిరుపతిరావు, వాసిపల్లి రాంబాబు, రూప, రజని, భవాని, రఘు, మధు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహారాణిపేట: మంత్రులు రామ్మోహన్ నాయుడు అచ్చెం నాయుడులకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బీరు కుమార స్వామి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. బీసీలకు గుర్తింపు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని మోదీలకు దక్కుతుందని తెలిపారు . ఈ కార్య క్రమంలో రాష్ట్ర కార్యదర్శి వారణాశి అన్నాజీ, ఉద్దండరావు వెంకటగిరి పలువురు నాయకులు పాల్గొన్నారు.


మంత్రులకు స్వాగతం పలుకుతున్న మాధవధార నాయకులు

మంత్రులకు సాదర స్వాగతం

మురళీనగర్, జూన్ 17; బిర్లా జంక్షన్‌లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు బిర్లా జంక్షన్‌లో టీడీపీ 50వవార్డు అధ్యక్షులు సనపల.వరప్రసాద్, 51వవార్డు అధ్యక్షులు సనపల.కీర్తి గజమాలతో స్వాగతం పలికారు. సనపల. బంగారురాజు, ఎస్సీ సెల్ జయరాజు, సిటీ నాయకులు వి.గిరి, కల్యాణ్ ఉన్నారు.

కన్నుల పండువగా విశ్వేశ్వర కల్యాణోత్సవం


కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

జగదాంబ కూడలి, జూన్ 17: దసపల్లా వద్దనున్న విశ్వేశ్వర ఆలయంలో స్వామివారు, పార్వతీదేవి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ వేడుకను తిలకించారు. దేవాలయ ప్రాంగణంలో ఆలయ అధికారులు ప్రత్యేకంగా పందిరి, మామిడాకులు తోరణాలను కట్టారు. విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు. వేదపండితులు శాస్త్రోతంగా విశ్వేశ్వర , పార్వతీ దేవి కల్యాణాన్ని జరిపించారు. ఏకదశి కావడంతో భక్తులు అభిషేక పూజలు జరిపారు. ఆలయ అర్చకులు విశ్వేశ్వరునికి లింగాష్ట, పాలభిషేకం, నామార్చన పూజలు చేయించారు. ఆలయ మేనేజర్ దేవుళ్ల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

కేజీహెచ్‌లో మెరుగైన సేవలందించాలి

» సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


సమావేశంలో వంశీకృష్ణ, పక్కన కలెక్టర్, కేజీహెచ్ అధికారులు

మహారాణిపేట, జూన్ 17: కేజీహెచ్‌లో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలందించేలా విభాధిపతులు, వైద్యులు కృషి చేయాలని దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీని వాస్ కోరారు. సోమవారం కేజీహెచ్‌లో కలెక్టర్ మల్లికార్జునతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే ప్రతీరోగికి సంతృప్తికర స్థాయిలో వైద్య సేవలు అందించి సహకరించాలని సూచించారు. వైద్యులు సమన్వయంతో పని చేసి ఆస్పత్రికిగుర్తింపు తీసుకురావాలని కోరారు.ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ కేజీహెచ్‌లో సీఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపపడుతున్నామన్నారు. వివిధ దశల్లో ఉన్న పనులను త్వ రలో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, వైద్య విభాగాల అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

కూటమి పాలనలోనే విశాఖ అభివృద్ధి

టీడీపీ నాయకులు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ


సత్యనారాయణకు వెంకటేశ్వరస్వామి చిత్రపటమిస్తున్న రజక ఫెడరేషన్ నేతలు

మహారాణిపేట, జూన్ 17: కూటమి అభ్యర్థుల గెలుపునకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల కృషి మరవలేనిదని టీడీపీ నాయకులు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. సోమవారం మహారాణపేటలోని ఓ సమావేశమందిరంలో తెలుగునాడు రజక ఫెడరేషన్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చీపురుపల్లి వెంకట సత్య స్వరూప్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా దాడి సత్యనారాయణ మాట్లా డుతూ అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్న విశాఖ నగరాన్ని ఆర్థిక రాజధానిగా అభివృద్ధికి సీఎం చంద్రనాయుడు ప్రకటించటం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రధాని మోదీ సహ జనసేన అధినేత పవన్ కల్యాణ్ విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో విశాఖ సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మహిళా నేత పసుపులేటి ఉషాకిరణ్, టీడీపీ నాయకులు డాక్టర్ రవికుమార్, రాజమండ్రి నారాయణ, , ఫేమ వసంత్ ధర్మా, భాస్కర్, రమణ, కృష్ణ రాజబాబు, తదిత రులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ జాతర


ప్రతిమలను ఊరేగిస్తున్న మహిళలు

అక్కయ్యపాలెం, జూన్ 17: దొండపర్తి గ్రామదేవత దుర్గమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ మేరకు అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కూచిపూడి నృత్య కళాకారులు, చిన్నారుల ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. అదే విధంగా అమ్మవారి ప్రతిమలను భక్తులు ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అల్లూరి సత్యనారాయణరెడ్డి, కారాల మహేష్, చిరంజీవి, పాలికల సింహాచలం పాల్గొన్నారు.

హత్యాయత్నం నిందితులపై చర్యలు తీసుకోండి

» అల్లూరి జిల్లా ఎస్పీకి హోంమంత్రి అనిత ఆదేశం

విశాఖపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై హత్యాయత్నం చేసిన నిందితులపై తక్షణం చర్యలు తీసుకోవాలని అల్లూరి సీతారామరాజుజిల్లా ఎస్పీ తుహీన్‌సిన్హాను హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. సర్క్యూట్‌హౌస్‌లో ఉన్న హోంమంత్రిని అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం కుసుమగుడ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అగతంబిడి చిన్నబాబు సోమవారం కలిసి తనపై హత్యాయత్నం జరిగినట్టు కేసు నమోదుచేసినా నిందితులపై ఇంతవరకూ చర్యలు తీసుకోలేదని ఫిర్యాదుచేశారు. ఈనెల ఎనిమిదిన తాను కుటుంబంతో కలిసి స్వగ్రామానికి వెళ్తుండగా అరకు వైసీపీ సర్పంచ్ భర్త, ఉపాధ్యాయుడు అయిన జి. రాము తన అనుచరులతో కలిసి కత్తులు, ఇనుపరాడ్లతో హత్యాయత్నం చేశారన్నారు. తనకు తీవ్రమైన గాయాలు కావడంతో రక్తస్రావం జరిగి ఆస్పత్రిలో చేరానన్నారు. దీనిపై డుంబ్రిగుడ పోలీసులకు ఫిర్యాదుచేయడంతో హత్యాయత్నం కింద కేసు నమోదుచేసినా, ఇంతవరకూ చర్యలు తీసుకోలేదన్నారు. వైసీపీ నేతలతో అక్కడి ఎస్ఐ అంటకాగుతూ వారి ఆదేశాల మేరకు నిందితులపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.దీంతో హోంమంత్రి అనిత అక్కడినుంచి ఏఎస్ఆర్‌జిల్లాఎస్పీకి ఫోన్‌చేసితక్షణం నిందితులపై చర్యలుతీసుకోవాలని ఆదేశించారు.

విశాఖ పోర్టుకు 20వ స్థానం

విశాఖపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా పోర్టుల పనితీరును ప్రపంచ బ్యాంకు అంచనా వేసినప్పుడు విశాఖ పోర్టుకు 20వ స్థానం దక్కిందని పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు సోమవారం తెలిపారు. రెండేళ్ల క్రితం 122వ స్థానంలో ఉన్న విశాఖ పోర్టు ఇప్పుడు 20వ స్థానానికి రావడం గణనీయమైన ప్రగతికి చిహ్నమన్నారు. పోర్టు హ్యాండ్లింగ్ సామర్థ్యం, పెట్టుబడులు, నూతన సాంకేతిక అంశాలు, నిర్వహణ వంటి అంశాల ఆధారంగా ఈ ర్యాంకింగ్ ఇచ్చినట్టు వెల్లడించారు.ఈ ఏడాది 90 మిలియన్ టన్నుల సరకును రవాణా చేయాలని, 10 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

గంజాయి సాగును అరికట్టండి

జ్ఞానాపురం, జూన్ 17: ఉమ్మడి విశాఖ జిల్లాలో గంజా యి సాగును అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ సీనియర్ నాయకులు విల్లూరి డాక్టర్ చక్రవరి, 33వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జ్ తిరుమలాదేవిలు మంగళవారం హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను సర్క్యూట్ హౌస్‌లో కలిసి సమస్యను వివరించారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా నియామకం పట్ల హర్షం

ఆరిలోవ, జూన్ 17 : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు నియామకం పట్ల ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పల్లా శ్రీనివాసరావు పార్టీకి చేసిన సేవలను గుర్తించి అధిష్ఠానం ఆయనకు సముచిత స్థానం కల్పించిందన్నారు. అలాగే 12వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, ఎస్సీ సెల్ చైర్మన్ బుడుమూరు గోవింద్, ఒమ్మి పోలారావు, 11వ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, రాజారావు, పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్, గాడి సత్యం, పాత్రకండ ధర్మారావు కూడా పల్లా నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

నాయకుల బైక్ ర్యాలీ

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమైన తరువాత తొలిసారిగా నగరానికి వస్తున్న పల్లా శ్రీనివాసరావుకు ఘన స్వాగతం పలకడానికి 12వ వార్డు నాయకులు భారీ బైక్ ర్యాలీతో ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఒమ్మి సన్యాసిరావు, బుడుమూరు గోవింద్, ఒమ్మి పోలారావు, సత్యం. అప్పలరాజు, రాంబాబు పాల్గొన్నారు.

9వ వార్డులో విజయోత్సవ సంబరాలు

ఆరిలోవ, జూన్ 17 : జీవీఎంసీ 9వ వార్డులోని హనుమంతవాక జంక్షన్‌లో కూటమి నాయకులు సోమవారం రాత్రి విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండో రోజు 37 కిలోల చందనం అరగదీత



సింహాచలం, జూన్ 17 : వరాహలక్ష్మీనృసింహస్వామికి జేష్ఠపౌర్ణమి నాడు అనగా ఈనెల 22న పైపూతగా సమర్పించాల్సిన శ్రీచందనం అరగదీత సోమవారం కూడా కొనసాగింది. ఆలయ బేడా మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిలలపై నాల్గవ తరగతి సిబ్బంది తొలిరోజు 35 కిలోలు చందనాన్ని అరగదీయగా, రెండో రోజు 37 కిలోల చందనాన్ని అరగదీశారు. సిబ్బంది అరగదీసిన చందనపు ముద్దను ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ఏఈఓ ఆనందకుమార్ పర్యవేక్షణలో తూనిక వేసి పద్మనిధిలో భద్రపరిచారు.

సాగర్‌నగర్ బీచ్‌లో కొబ్బరి మొక్కలు

సాగర్‌నగర్, జూన్ 17 : సాగర్‌నగర్ బీచ్‌లో సోమవారం జీవీఎంసీ ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కలు నాటారు. ఇటీవల వీచిన ఈదురుగాలులకు రుషికొండతో పాటు పక్కనున్న పలు బీచ్‌ల్లో కొబ్బరి మొక్కలు నేలకొరిగాయి. వాటి స్థానంలో జీవీఎంసీ కొత్తగా మొక్కలు నాటింది.

శివశక్తినగర్‌లో నేత్ర వైద్య శిబిరం

కొమ్మాది, జూన్ 17 : ప్రజలు నేత్ర సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎన్‌డీఏ కూటమి సభ్యుడు గండికోట రాజేష్ శర్మ అన్నారు.సోమవారం శివశక్తినగర్ రోడ్డులో దుర్గాదేవి అమ్మవారి ఆలయ ఆవరణలో విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు బాలకృష్ణ వంద మంది రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు బ్రహ్మాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

23న రక్తదాన శిబిరం

కొమ్మాది, జూన్ 24 : పీఎంపాలెం శివారు అంజనాద్రిపై ఉన్న శృంగేరి శంకర మఠం ఆధ్వర్యంలో ఈనెల 23న మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఆలయ పరిపాలనాధికారి మురళీ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శిబిరంలో వైద్యులు బీపీ, షుగర్, ఈసీజీ, ఎముకలు, దంత సమస్యలు, జనరల్ పరీక్షలు చేస్తారని చెప్పారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సినిమా గైడ్

- **మహారాజ :** మెలోడీ, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **మ్యూజిక్ షాపు మూర్తి:** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **సత్యభామ :** సంగం, శ్రీకన్య (గాజువాక)
- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **గం గం గణేశా :** వెంకటేశ్వర, శ్రీకన్య (గాజువాక)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 52, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 42, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 50, బీరకాయలు 48, ఆనపకాయలు 26, కాలీఫ్లవర్ 34, క్యాబేజ్ 28, క్యారెట్ 30, దొండకాయలు 40, బంగాళా దుంపలు 32, అరటి కాయ (పె)7, మునక్కాడలు (కిలో) 64, అల్లం (పాతది) 170, బరబటి 64, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 38, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 140, పొటల్స్ 38, కీరదోస 30, కాప్సికమ్ 90, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడ దుంపలు 42,కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి .., కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 24, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	-- 128
ఫారం ధర	-- 148
విత్ స్కిన్	-- 266
స్కిన్‌లెస్	-- 276

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



ఆనందపురంలో జరిగిన విజయోత్సవ వేడుకల్లో గంటా శ్రీనివాసరావు



గంటాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మధురవాడ టీడీపీ నాయకులు

కార్యకర్తలకు అండగా ఉంటా : గంటా

భీమునిపట్నం (రూరల్), జూన్ 17 : నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ఎమ్మెల్యేగా ఎన్నికైన గంటా శ్రీనివాసరావు అన్నారు.ఆదివారం రాత్రి ఆయన అన్నవరం గ్రామంలో జరిగిన విజయోత్సవ సభలో మాట్లాడారు.తనకు అత్యధిక మెజారిటీ ఇచ్చిన భీమిలి ప్రజల్ని మరిచిపోనని, వారి రుణం అభివృద్ధి పనులు చేయడం ద్వారా తీర్చుకుంటానని చెప్పారు. గత అయిదేళ్లుగా పార్టీ కార్యకర్తలు ఎన్ని కష్టాలు పడ్డారో తనకు తెలుసునని, ఇకపై కార్యకర్తలు కాలర్ ఎగరేసుకుని తిరగాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తానని తెలిపారు. కాగా గంటా శ్రీనివాసరావుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పలు సాంస్కృతికకార్యక్రమాల మధ్య గ్రామంలో భారీ ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో గంటా రవితేజ, టీడీపీ మండల అధ్యక్షుడు డి. అప్పలనరసింహరాజు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంటు భుక్త రామానాయుడు, నాయకులు లక్ష్మణరావు, పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

భీమిలిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా...

ఆనందపురం : నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని గంటా అన్నారు. ఆయన పెద్దిపాలెం, శొంఠ్యాం పంచాయతీల్లో జరిగిన విజయోత్సవ ర్యాలీల్లో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం పక్కాగా అమలు కావాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. గత ప్రభుత్వ నిరంకుశ పాలనకు ప్రజలు బలైపోయారని, రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనుకబడిందని చెప్పారు. తనకు అఖండ మెజారిటీని కట్టబెట్టిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, ఈ విజయాన్ని ప్రజలకు అంకితం చేస్తున్నానని తెలిపారు.ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని ప్రకటించారు. కాగా విజయోత్సవ ర్యాలీకి వచ్చిన గంటాకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించడంతో పాటు దారి పొడవునా పూల వర్షం కురిపించారు. కార్యక్రమంలో కోరాడ రాజబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గంటాను కలిసిన నాయకులు

కొమ్మాది : గంటా శ్రీనివాసరావును మధురవాడ టీడీపీ నాయకులు సోమవారం ఎంవీపీ కాలనీలోని గంటా నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ మధురవాడ ప్రాంతంలో పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలన్నారు. కష్టపడి పని చేసిన వారికి తప్పని సరిగా గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొలగాని సన్యాసిరావు, మన్నాల సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.



భీమిలిలోని జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



తారా మసీదులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణబాబు

త్యాగానికి ప్రతీక బక్రీద్ : ఎమ్మెల్యే వెలగపూడి

మద్దిలపాలెం/ఆరిలోవ, జూన్ 17 : జీవీఎంసీ 22వ వార్డు తారా మసీదులో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లాంలో త్యాగం, దానగుణాలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ జరిపే బక్రీద్ సమాన భావన పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, దువ్విస్వామి, తారామసీదు పెద్దలు పాల్గొన్నారు. అలాగే ఆరిలోవలోని పలు ప్రాంతాల్లోనూ బక్రీద్ నిర్వహించారు.

భీమునిపట్నం : పట్టణంలోని ముస్లింలు బక్రీద్‌ను సోమవారం భక్తి శ్రద్ధలతో జరిపారు. ఉదయం ఈద్‌గావ్‌లో ప్రత్యేక నమాజ్ చేశారు. ఈ సందర్భంగా జామియా మసీదు ఎండీ నసీమ్ అక్తర్ బక్రీద్ సందేశాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో మసీదు పెద్దలు అబ్దుల్ మతిన్, షేక్ యాసీన్, అబ్దుల్ నయీమ్, అన్వర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను ముస్లిం సోదరులు అత్యంత భక్తి ప్రపత్తులతో జరిపారు.మధురవాడ, శివశక్తినగర్, మారికివలస తదితర ప్రాంతాల్లోని దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

తగరపువలస : బక్రీద్ సందర్భంగా తగరపువలస మసీదులో ముస్లింలు ప్రార్థనలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లింలు సమావేశమై నమాజ్ చేశారు. పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు

ఉపాధ్యాయులకు గుదిబండగా యాప్‌లు

ఆరిలోవ, జూన్ 17 : ఉపాధ్యాయులకు గుది బండగా ఉన్న అన్ని యాప్‌లను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు డిమాండ్ చేశారు. సోమవారం రవీంద్రనగర్‌లోని ఎస్‌బీజీ ప్రాథమిక పాఠశాలలో ఎస్టీయూ రాష్ట్ర ప్రతినిధి దేముడుబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఇతర పనులేవీ అప్పగించవద్దని, జీఓ నెంబరు 117 రద్దు చేసి 3, 4, 5 తరగతులను పూర్వపు పద్ధతిలోనే కొనసాగించాలని కోరారు. ప్రతిరోజూ పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని ఎత్తి వేయాలని కోరారు, వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల విద్యా వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని, విద్యార్థుల్లో చదివే సామర్థ్యం కూడా తగ్గిందన్నారు. ఈ సమావే శంలో ఎస్టీయూ నాయకులు పద్మావతి, ప్రభాకరరావు, బీహెచ్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు కనీస వైద్యం కరువు

సింహాచలం, జూన్ 17 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అత్యవసరంగా అందాల్సిన వైద్యం అందడం లేదు. భక్తుల వైద్య సహాయం నిమిత్తం దేవస్థానానికి ఎస్‌బీఐ సింహాచలం శాఖ గతంలో సీఎస్ఆర్ నిధులతో అంబులెన్స్ సమకూర్చింది. అందులో ఉండాల్సిన వైద్య సహాయకుడ్ని ఔట్‌సోర్సింగ్ విధానంలో దేవస్థానం అధికారులు నియామకం జరిపి అత్యవసర మందులకు కొంత మొత్తాన్ని ప్రతి నెలా వెచ్చిస్తోంది. అయితే సోమవారం అనకాపల్లి ప్రాంతానికి చెందిన ఎన్. లక్ష్మీ (71) క్యూలో అకస్మాత్తుగా పడిపోయింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయమైంది. బాధితురాలి పరిస్థితిని గమనించిన స్వచ్ఛంద సేవకురాలు అంబులెన్స్‌ను వెదుక్కుని ఆమెను తీసుకువెళ్లగా అందులో డ్రైవర్ మినహా వైద్య సహాయకుడు అందుబాటులో లేరు. అతను సెలవులో ఉండడంతో వృద్ధురాలికి కనీస వైద్య సాయం అంద లేదు. అంబులెన్స్ డ్రైవర్ ఆమెను కొండదిగువన ఉన్న గ్రామీణ ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి అత్యవసర వైద్య సహాయాన్ని అందించారు.

రోడ్డుపై మురుగు నీటితో ఇబ్బందులు



రోడ్డుపై నిలిచిన మురుగు నీరు



కాలువలో పేరుకుపోయిన చెత్త

ఎంవీపీ కాలనీ, జూన్ 17 : అధికారుల నిర్లిప్తత, స్థానికుల్లో కొరవడిన చైతన్యం వెరసి 17వ వార్డు ఆదర్శనగర్‌లోని వీధులు తీవ్ర అపారిశుధ్యంలో ఉన్నాయి. ముఖ్యంగా దుర్గాదేవి ఆలయం సమీపంలోని వీధిలో కాలువలపై కొందరు నివాసితులు సిమెంటు దిమ్మలు వేసేసి, కాలువలను మూసేశారు. దీంతో ఎక్కడికక్కడ కాలువల్లో చెత్త నిల్వ ఉండిపోయి, మురుగు నీరు రహదారులపైకి వచ్చేస్తోంది. దీంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు ఈ విషయమై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. తక్షణమే స్పందించి ఈ ప్రాంతాన్ని పరిశీలించి, దిమ్మలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలని వినతి



అనితకు వినతిపత్రం ఇస్తున్న రామ్

సిరిపురం, జూన్ 17 : వైసీపీ పాలనలో బాధ్యతలను మరిచి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నగరంలోని సర్క్యూట్ హౌస్‌లో రాష్ట్ర హోం శాఖ మంత్రి అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అనుచరులు తనకు ఫోన్ చేసి దుర్భాషలాడి చంపుతామని బెదిరించారన్నారు. మరోవైపు తాను ఇంట్లో లేని సమయంలో పోలీసులు వచ్చి తన తండ్రిని బెదిరించడంతో ఆస్పత్రి పాలయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 14వ వార్డు అధ్యక్షుడు పీవీ వసంతరావు, పి. జగదీష్‌బాబు, బొడ్డేపూడి దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షనర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం

వెంకోజీపాలెం, జూన్ 17 : కొత్త వెంకోజీపాలెం రిటైర్డ్ ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షనర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. రెండేళ్లకు గాను ఏర్పాటైన నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా బోరా నూకారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పీల రమణ, కార్యదర్శిగా కాళ్ల సూరిబాబు, కోశాధికారిగా మద్దాల ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా డి. నూకరాజు, సలహాదారులుగా దాడి పరదేశిరావు, మద్దాల నరసింగరావు, ఇతర కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

ఘనంగా కనక దుర్గమాంబ పండగ

వెంకోజీపాలెం, జూన్ 17 : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట గ్రామస్తుల ఇలవేల్పు కనకదుర్గమాంబ వార్షిక పండగ పురస్కరించుకుని సోమవారం తొలేళ్ల ఉత్సవం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్ సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పుర వీధుల్లో ఊరేగించారు. మంగళవారం అనుపోత్సవం ఉంటుందని, వచ్చే నెల 7న మహా అన్నదానం నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీకృష్ణ ఉమామహేశ్వర సాయి దుర్గ యాదవ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు గొలగాని రాము, ప్రసాదుల పోలారావు, అధ్యక్షుడు ఈగల శివ గోవింద్, పల్లా అప్పారావు, బొట్టా గణేష్, బొట్టా లింగేష్, పల్లా శివ, మువ్వల శ్రీను, ప్రసాదుల అప్పారావు, మాజీ అధ్యక్షుడు బొట్టా శివ, పాల్గొన్నారు.

చెరువు గర్భంలో డెబ్రిస్



చెరువును పూడ్చివేయడానికి వేసిన డెబ్రిస్

మధురవాడ, జూన్ 17 : స్థానిక శిల్పారామంలో ఉన్న చెరువులో కొందరు భవన నిర్మాణదారులు డెబ్రిస్ వేస్తున్నారు. చెరువును డెబ్రిస్‌తో పూడ్చివేయడం పట్ల పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిల్పారామంలో ఉన్న రెండు కల్యాణ మండపాలను ప్రస్తుతం ఆధునికీకరిస్తున్నారు. ఈ రెండూ అందుబాటులోకి వస్తే కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగుకు వీలుగా చెరువు గర్భాన్ని డెబ్రిస్‌తో పూడ్చడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా కొంత డెబ్రిస్‌ను చెరువు గర్భంలో వేయగా ప్రకృతి ప్రేమికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ పనులను నిలిపివేశారు. ఈ విషయమై శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డిని వివరణ కోరగా చెరువులో కొంతమేరకు డెబ్రిస్ ఉండడం వాస్తవమేనని, చెరువు పూడ్చే ప్రయత్నం నిలిపివేశామని తెలిపారు.

ఘనంగా త్రిమూర్తిక వెంకటేశ్వరాలయం వార్షికోత్సం

వెంకోజీపాలెం, జూన్ 17 : ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయం వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే వేడుకల్లో భాగంగా శ్రీవారు, లక్ష్మీదేవి, బాలస్వామిలకు పంచామృతాభిషేకాలు, అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, నీరాజనం తదితర పూజలతో పాటు సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంపై తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం స్వామివారికి కల్యాణోత్సవం, హోమం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి ఎం. సావిత్రి, కోశాధికారి కడియం సుబ్బారావు, ఆలయ మేనేజర్ బోగాది సన్యాసిరావు, శివ, తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు, జీవీఎంసీ అధికారులు

అన్న క్యాంటీన్ పునరుద్ధరణకు చర్యలు

తగరపువలస, జూన్ 17 : తగరపువలస కూడలిలో మూతపడిన అన్న క్యాంటీన్ పునరుద్ధరణకు స్థానిక నాయకులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. క్యాంటీన్ భవనం చుట్టూ పేరుకుపోయిన తుప్పలు, డొంకలను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నారు. ఒకటి, రెండు డివిజన్లకు చెందిన నాయకులు సోమవారం ఏర్పాట్లు పరిశీలించి, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. నాలుగు మండలాలకు ప్రధాన కూడలి కావడంతో గతంలో ఈ క్యాంటీన్ ద్వారా ప్రతిరోజూ పదుల సంఖ్యలో కూలీలు, యువత, ఉద్యోగులు భోజనాలు చేసేవారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి సంతలకు వచ్చే మహిళలు మధ్యాహ్నం సరుకుల అమ్మకాలు తరువాత క్యాంటీన్‌లో భోజనాలు చేసి ఇళ్లకు వెళ్లిపోయేవారు. క్యాంటీన్‌ను మళ్లీ పునఃప్రారంభించడం వల్ల వారందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 364 మంది ఎంపిక



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయ్‌బాబు

మద్దిలపాలెం, జూన్ 17 : డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 326 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఐ. విజయ్‌బాబు తెలిపారు. జేకేసీ, డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా నిర్వహించిన ఈ జాబ్ మేళాలో 29 సంస్థలు పాల్గొన్నాయి. ఆయా సంస్థల్లో ఉద్యోగాలకు వివిధ కళాశాలల నుంచి 1230 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి 364 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ జి. శ్రీనివాసరావు, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ప్లేస్మెంట్ కోఆర్డినేటర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో దుర్గాలమ్మ తొలేళ్ల ఉత్సవం



ఉత్సవం సందర్భంగా గ్రామస్థులకు సూచనలిస్తున్న సీఐ శ్రీధర్

పద్మనాభం, జూన్ 17 : పద్మనాభంలో దుర్గాలమ్మ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. చదురుగుడి వద్ద అమ్మవారికి పూజారి గురునాయుడు, తాలాడ అయ్యవారి కుటుంబ సభ్యులు పూజలు చేసి, డోలు, డప్పు వాయిద్యాలతో దుర్గాలమ్మ జోగిని ప్రధాన వీధుల్లో ఊరేగించారు.అనంతరం ఘటాలను కూడా ఊరేగించి సతకం పట్టు వద్ద వాటిని నిలిపి పూజలు చేశారు. సీఐ శ్రీధర్ గ్రామాన్ని సందర్శించి ఉత్సవ ఏర్పాట్లను, పండగ విశేషాలను కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనుపోత్సవానికి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంతంగా పండగ నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పద్దు, రమణ, పైడినాయుడు, రాము, గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

భీమునిపట్నం, జూన్ 17 : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల పక్షపాతి అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. సోమవారం బీచ్ రోడ్‌లో వున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో 3వ వార్డు కూటమి నాయకులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే ఐదు ఫైళ్లపై సంతకాలు చేసి అందరి కళ్లల్లోనూ ఆనందం నింపారన్నారు. కూటమి పాలనతోనే రాష్టాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని చెప్పారు. ఎటువంటి కక్ష సాధింపులు, ఒత్తిడి లేకుండా ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందిస్తామని చంద్రబాబు చెప్పడంతో ప్రజలు అనందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు, టీడీపీ ప్రధాన కార్యదర్శి గొలగాని నరేంద్రకుమార్, చురకల రమణ, కంటుభక్త సునీత, గాడు సన్యాసినాయుడు, మారోజు సంజీవ్, కనకల అప్పలనాయుడు, కాసరపు నాగరాజు, కంచర్ల కామేష్, ఆవాల సూరిబాబు, వియ్యపు పోతురాజు, గాడు ఆనంద్, సంకురుభుక్త జోగారావు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, జూన్ 17 : వరాహలక్ష్మీనృసింహస్వామికి సోమవారం పలు ఆర్జిత సేవలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో బేడా మండపంలో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అర్చకులు భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ సహస్రనామావళి పఠిస్తూ ప్రతి నామానికి తులసీ దళాలతో అర్చన చేశారు. తరువాత గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి ఉపచారాలు సమర్పించి అష్టోత్తర శతనామార్చన జరిపారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణాన్ని పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో వైభవంగా నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.




గాజువాకలో శాంతి ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు


పెదమడక మసీదులో సామూహిక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో బక్రీద్

పలు ప్రాంతాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు

గాజువాక, జూన్ 17: బక్రీద్ పండుగను పలు ప్రాంతాల్లోని ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా గాజువాక ఆజీమాబాద్ సున్ని జమా మసీదు నుంచి కణితి రోడ్డు మీదుగా ఈద్గా మైదానం ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ సామూహిక నమాజ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మత పెద్దలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని, సోదర భావంతో మెలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎండీ రఫీ, మదీనా వలీ, ఇషాక్, జబ్బర్, అన్సర్ వలీ, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: బక్రీద్ పండుగ సందర్భంగా గోపాలపట్నం పరిసరాల్లోని మసీదుల్లో ఈద్‌గాహ్‌లలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొని సామూహిక నమాజులు ఆచరించారు. కొత్తపాలెంలోని మజీద్ ఏ నూరానియా, గోపాలపట్నంలోని తాహా మసీదు, నందమూరినగర్‌లోని మసీదుల్లో ముస్లింలు ఈద్ నమాజ్ చేశారు. ఈ సందర్భంగా మసీదు ఇమామ్‌లు బక్రీద్ ప్రాధాన్యాన్ని వివరించారు. ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొత్తపాలెంలోని మజీద్ ఏ నూరానియా కమిటీ సభ్యులు శాంతి ర్యాలీ చేపట్టారు.

ఆటోనగర్: జీవీఎంసీ 70, 71 వార్డుల పరిధిలోని ఆటోనగర్, కుంచుమాంబ కాలనీ, ఎల్‌వీ నగర్ మసీదులలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. మత పెద్దలు మాట్లాడుతూ త్యాగ నిరతికి, నిస్వార్థ సేవా గుణానికి ప్రతీక బక్రీద్ అని సందేశమిచ్చారు. టీడీపీ 70వ వార్డు మైనారిటీ అధ్యక్షుడు రెహమాన్ మాట్లాడుతూ అల్లాహ్‌పై ఉన్న విశ్వాసాన్ని చాటుతూ భక్తిశ్రద్ధలతో ఈద్గాలో సామూహికంగా ప్రార్థనలు చేసి ఒకరికొకరికి శుభాకాంక్షలు చెప్పుకోవడం ముస్లిం ఐక్యతను చాటుతుందన్నారు. కార్యక్రమంలో సలార్ బాబా, మహ్మద్, అబ్దుల్ రహీం, అయూబ్, ఖాసీం, ముస్తఫా, జిలానీ, అన్సర్, ఖాజా భాయ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే 86వ వార్డు పరిధి ఫకీరుతక్యాలో, 87వ వార్డు వడ్లపూడిలో బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు.

అగనంపూడి: గ్రేటర్ 79, 85వ వార్డుల పరిధి అగనంపూడి, పరసర ప్రాంతాల్లోని ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. పెదమడక మసీద్‌లో అబూబకర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు బక్రీద్ విశిష్టతను వివరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బి. సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, బాషాచ రహిమన్, అబుల్ రెహమాన్, షేక్ సిలారి, హుస్సేన్, సలీమ్, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: మండలంలోని చినముషిడివాడ, పెందుర్తి, సరిపల్లిల్లో గల మసీదుల్లో ముస్లింలు సామూహిక నమాజ్‌లు చేశారు. పవిత్ర గ్రంథం ఖురాన్‌ను పఠించారు. చినముషిడివాడలో మసీద్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ బ్రుహాన్ ఇస్లాం సారాంశాన్ని వివరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.


పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నల్లూరు సూర్యనారాయణ

'పల్లా'కు నల్లూరు అభినందనలు

గాజువాక, జూన్ 17: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. గాజువాక ప్రాంతానికి చెందిన వ్యక్తికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా అత్యున్నత పదవిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని నల్లూరి పేర్కొన్నారు. ప్రజాసేవ చేసే వారికి టీడీపీలో తగిన గుర్తింపు ఉందనడానికి ఇదే నిదర్శనమని ఆయనన్నారు.

శ్రీరామ్‌నగర్ గెడ్డలో పూడికల తొలగింపు


ఎక్స్‌కవేటర్ సాయంతో పూడికలను తొలగిస్తున్న దృశ్యం

మల్కాపురం, జూన్ 17: జీవీఎంసీ 58వ వార్డు పరిధి శ్రీరామ్‌నగర్‌లోని గెడ్డలో పేరుకుపోయిన పూడికలను జీవీఎంసీ సహకారంతో నేవీ సిబ్బంది తొలగించారు. ఇటీవలే ఈ గెడ్డకు సంబంధించి తలెత్తిన సమస్యను ఎమ్మెల్యే గణబాబు దృష్టికి పలువురు స్థానికులు తీసుకువెళ్లడంతో ఆయన ఈ విషయంపై జీవీఎంసీ అధికారులతో మాట్లాడారు. ఈ మేరకు గ్రేటర్ అధికారులు గెడ్డను పరిశీలించడంతో పాటు నేవీ అధికారులతో మాట్లాడి పూడికలను తొలగించారు. టీడీపీ 58వ వార్డు ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్ పూడికల తొలగింపు పనులను పరిశీలించారు.



ఘనంగా మోదకొండమ్మ తొలేళ్ల ఉత్సవం

గోపాలపట్నం, జూన్ 17: స్థానిక ఇందిరానగర్‌లో కొలువుదీరిన మోదకొండమ్మ అమ్మవారి తొలేళ్ల ఉత్సవాన్ని సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అమ్మవారి ఆలయం నుంచి ఉత్సవ ప్రతిమలను మేళతాళాల నడుమ తోడ్కొని వచ్చారు. అనంతరం అమ్మవారి ప్రతిమలను, ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. కాగా మంగళవారం అమ్మవారి ప్రధాన పండుగను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. సోమవారం అర్ధరాత్రి దాటాక మోదకొండమ్మను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి రానున్నందున క్యూ లైన్లను ఏర్పాటు చేశారు.


మోదకొండమ్మ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మల్కాపురంలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

మల్కాపురం: మల్కాపురం బజారులో ఉన్న దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు.

పెందుర్తి పాత పీహెచ్‌సీ వద్ద..

పెందుర్తి: ఇక్కడి పాత పీహెచ్‌సీ వద్దనున్న వీరాంజనేయ స్వామి ఆలయ 31వ వార్షికోత్సవాన్ని ఆలయ వ్యవస్థాపకుడు బుద్ధ శివాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, గణబాబు హాజరై వీరాంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ముదునూరి రాజాసుధాకర్, అయిత సింహాచలం, పిల్లా జగన్మోహనపాత్రుడు గొర్లె అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

గవరపాలెం బస్టాండ్ కూడలిలో..

పెందుర్తి-రూరల్, జూన్ 17: గ్రేటర్ 95వ వార్డు పరిధి లక్ష్మీపురం గవరపాలెం బస్టాండ్ కూడలిలో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించు కున్నారు. స్థానిక రామలయ, గీతా భక్తబృందాల సభ్యులు హనుమాన్ చాలీసాను పఠించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. మాజీ సర్పంచ్‌లు ఆళ్ల తాతారావు, పి.వెంకటరావు, టీడీపీ నాయకులు పి.సీతారాం, మద్దాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

57వ వార్డులో టీడీపీ సంబరాలు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 17: పశ్చిమ ఎమ్మెల్యేగా పి.గణబాబు భారీ మెజారిటీతో గెలుపొందడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ 57వ వార్డు పరిధి ఎన్ఏడీ సమీపంలోని సాకేతపురంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గణబాబు తనయుడు మౌర్య సింహ కేక్ కట్ చేశారు. ఎన్నికల్లో ఇక్కడి బూత్ నంబర్ 70లో సుమారు 300 ఓట్ల మెజారిటీ రావడానికి కృషి చేసిన బూత్ కన్వీనర్ అంగటి మూర్తి దంపతులను మౌర్య సింహ ఘనంగా సన్మానించారు. అలాగే బూత్ కన్వీనర్లు సంతోశ్, ప్రకాశ్, మూర్తి, షరీఫ్ తదితరులను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పెంటకోట అజయ్, టీఎన్ఎస్ఎఫ్ ప్రవీణ్, శ్రీను, సరేశ్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యే అన్నింటికీ ఆధారం: ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, జూన్ 17: విద్యే అన్నింటికీ ఆధారమని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 584 మార్కులు సాధించిన సరిపల్లి భాష్య పాఠశాలకు చెందిన సుంకరి సుశాంత్‌ను సోమవారం పెందుర్తిలో ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే జీవిత మనుగడ ఉందన్న సత్యాన్ని అందరూ గ్రహించాలన్నారు. జనసేన నాయకుడు కంచిపాటి మధు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమష్టి కృషితోనే ప్లాంట్ ప్రగతి సాధ్యం

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 17: స్టీల్‌ప్లాంటులో అందరి సమష్ఠ కృషితోనే మరింత ప్రగతి సాధ్యమవుతుందని జీఎం మధుసూదనరావు అన్నారు. స్టీల్‌ప్లాంటులో పదవీ విరమణ చేసిన బీటీ నాయక్ (జీఎం), వి.తిరుపతిరావు (హెచ్‌ఆర్-లైజన్ అధికారి)లను సోమవారం ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ నాణ్యమైన ఉక్కు ఉత్పత్తులకు కేంద్రంగా స్టీల్‌ప్లాంట్ నిలిచిందన్నారు. రానున్న రోజుల్లో ఉక్కు కర్మాగారాన్ని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు అందరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో సీ ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్, ప్రతినిధులు నరసింహ, దుర్గాప్రసాద్, నాయక్, కృష్ణ, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.





నిర్మానుష్యంగా ఉన్న యాదవ జగ్గరాజుపేట రహదారి

భానుడు భగభగ-రహదారులు వెలవెల

కూర్మన్నపాలెం, జూన్ 17: గత కొద్ది రోజులుగా భానుడు ఉగ్ర రూపం దాల్చడంతో బయటకు వచ్చేందుకే ప్రజలు ఠారెత్తిపోతున్నారు. సోమవారం ఎనిమిది గంటల నుంచే ఎండ వేడిమి మొదలై పదకొండు గంటల తర్వాత నుంచి మరింత అధికమైంది. సూరీడు ప్రతాపానికి వడగాడ్పులు కూడా తోడవ్వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎండ అధికంగా ఉండడంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాలేదు. దీంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ప్రధాన కూడళ్లు సైతం వెలవెలబోయాయి. ఆటోనగర్, శ్రీనగర్, కూర్మన్నపాలెం, దువ్వాడ. వడ్లపూడి, స్టీల్‌ప్లాంట్ వంటి ప్రధాన కూడళ్లు కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించాయి. ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు అల్లాడిపోయారు.

వైభవంగా ఎస్టీబీఎల్ వేంకటేశ్వరస్వామి కల్యాణం

అక్కిరెడ్డిపాలెం, జూన్ 17: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పుష్పాలతో శ్రీవారిని అలంకరించి ప్రత్యేక పూజలను వేదపండితులు జరిపాక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను సూర్యప్రభ వాహనంపై అధిష్ఠింపజేసి భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఊరేగించారు. సాయంత్రం దివ్యక్షేత్రంలో ప్రత్యేక వేదికపై ఉభయ దేవేరులతో శ్రీవారిని ఆశీనులను గావించి వేదపండితులు హైందవ సంప్రదాయ పద్ధతిలో కల్యాణాన్ని నిర్వహించారు. ఈ పూజల్లో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌తో పాటు పాలక మండలి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గొల్లనారాయణపురంలో కార్పొరేటర్ పర్యటన

వేపగుంట, జూన్ 17: జీవీఎంసీ 93వ వార్డు భరత్‌నగర్ సమీపం గొల్లనారాయణపురంలో కార్పొరేటర్ రాపర్తి కన్నా సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి బావిని బాగు చేయడంతో పాటు చుట్టూ గోడ నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించేందుకు త్వరలో రూ.19.85 లక్షలతో టెండర్లు పిలవనున్నట్టు కార్పొరేటర్ వివరించారు.

తుంగ్లాంలో ముగ్గురు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం, జూన్ 17: తుంగ్లాంలోని కుంచుమాంబ, ముత్యమాంబ, దుర్గమాంబ ఆలయాల ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించి, పూజలు చేశారు. అమ్మవార్లను కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దంపతులతో పాటు స్థానిక నాయకులు కొల్లి అప్పలరెడ్డి, ఎస్.సింహాచలం, ఎస్.అచ్చిబాబు, కె.కుంచారావు, వరహాలు, అర్జున్, తదితరులు దర్శించుకున్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు

మల్కాపురం, జూన్ 17: గాజువాక ఆర్టీసీ డిపో నుంచి జింక్ గేటు వరకు సెంటర్ డివైడర్ మధ్యన విద్యుత్ దీపాలపై పడుతున్న చెట్ల కొమ్మలను జీవీఎంసీ సిబ్బంది సోమవారం తొలగించారు. ఈ కొమ్మల మూలంగా విద్యుత్ దీపాల వెలుగులు ప్రసరించకుండా ఉంటున్నాయని పలువురు వాహనదారులు, స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు స్పందించి చెట్ల కొమ్మల తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు.


హృదయపూర్వక శుభాకాంక్షలు
మాకు అత్యంత ఆప్తులు, మృదుస్వభావి, నిరాడంబరులు,
ప్రజా సేవే పరమావధిగా పనిచేస్తున్న
గాజువాక నియోజకవర్గ శాసనసభ్యులు
గౌ॥ శ్రీ పల్లా శ్రీనివాసరావు గారు
రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన శుభ తరుణంలో
హృదయపూర్వక శుభాకాంక్షలతో...
మీ.. మావూరి వెంకటరమణ
ఛైర్మన్ : సి.యం.ఆర్. గ్రూప్
CMR
SHOPPING MALL
The joy of life
• విశాఖపట్నం • గాజువాక • గోపాలపట్నం • గుంటూరు • రాజమహేంద్రవరం • విజయనగరం • శ్రీకాకుళం • తిరుపతి • కాకినాడ • ఏలూరు • అనకాపల్లి • భీమవరం • అమలాపురం • నరసన్నపేట
• నర్సీపట్నం • ఒంగోలు • కొత్తగూడెం • ఖమ్మం • విజయవాడ • సూర్యాపేట • మిర్యాలగూడ • ఉప్పల్ • హన్మకొండ • షాద్‌నగర్ • మార్కాపురం • ప్రొద్దుటూరు • తుని